సాక్షి
విశాఖపట్నం
గురువారం । 8 । జూన్ । 2023



మెరిసిన మహిళలు

అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా జరిగిన మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర పోటీల్లో మహిళలు మెరిశారు. 8లో



క్రీడల్లో మంచి పేరు తేవాలి

విద్యార్థులు క్రీడల్లో రాణించి విశాఖకు మంచి పేరు తీసుకురావాలని మేయర్ హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. 8లో

కాన్వాస్‌పై మెరుపులు



చిత్రలేఖనంలో ఇద్దరు బాలికలు విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు వివిధ పోటీల్లో పతకాలు కొల్లగొడుతూ ఈ ప్రాంత ప్రతిష్టను ఇనుమడింపజేస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

679 మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం



కానిస్టేబుళ్ల బదిలీల ప్రక్రియను చేపడుతున్న పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 679 మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ బుధవారం బదిలీల ప్రక్రియను చేపట్టారు. వచ్చే ఏడాది సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రతి కానిస్టేబుల్ సర్వీస్, వయసు పరిగణలోకి తీసుకుని వారి ప్రాధాన్యతల ప్రకారం బదిలీలు చేశారు. ఈ బదిలీల ప్రకియపై రెండు రోజులుగా సీపీ స్వయంగా దృష్టిసారించి ఒకే చోట అయిదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న సిబ్బందికి స్థాన చలనం కలిగించారు. ముందుగా ఖాళీలను ప్రాజెక్టర్‌పై ప్రదర్శించి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ సందర్భంగా సీపీ త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తించి పోలీస్ శాఖ ప్రతిష్ట పెంపొందించాలన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా


కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 9న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు కె.సుధ(టెక్నికల్), సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. ట్రస్ట్ సర్వీసెస్, శ్రీరామ్ చిట్స్, శరణ్ మోటార్స్, జీ4 సెక్యూరిటీ, పాల్లో ట్రాన్స్‌పోర్ట్, దసపల్లా హోటల్, ఎస్‌బీఐ కార్డ్, ఆన్‌లైన్ గ్రోసరీ, అదానీ ఫౌండేషన్, అపోలో ఫార్మసీ తదితర కంపెనీల్లో 301 ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కెమిస్ట్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజినీర్, వేర్ హౌస్ అసోసియేట్లు, జీఐఎస్ ఇంజినీర్, టెలీ కాలింగ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, సెక్యూరిటీ గార్డ్స్ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్యాడ్యుయేట్, ఐటీఐ, డిప్లమో, ఫార్మసీ, ఎంబీఏ చేసిన వారు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాలను బట్టి 18–30 ఏళ్ల వయసు ఉన్న వారు ఇంటర్వ్యూకు హాజరుకావచ్చని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు https://www.ncs.gov.in/ లో పేర్లు నమోదు చేసుకుని.. ఆ రోజు ఉదయం 10 గంటలకు జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

ఇద్దరు రైలు ప్రమాద బాధితుల డిశ్చార్జ్

కేజీహెచ్‌లో ఒకరికి కొనసాగుతున్న చికిత్స

మహారాణిపేట: ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ముగ్గురిలో ఇద్దరు బుధవారం డిశ్చార్జ్ అయ్యారు. ఈ నెల 4న కేజీహెచ్‌లో ముగ్గురిని చేర్పించిన సంగతి తెలిసిందే. ఐసోలేషన్ వార్డులో ప్రస్తుతం చికిత్స పొందుతున్న ఎ.శంకరరావు ఆరోగ్యం స్థిరంగా ఉందని సూపరింటెండెంట్ శివానంద్ తెలిపారు. బుచ్చిరాజుపాలెం ప్రాంతానికి చెందిన మాధవరావు, భారతి పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశామన్నారు. ఇటీవల మంత్రి అమర్‌నాథ్.. శంకరరావుకు రూ.లక్ష, మాధరరావు, భారతీలకు రూ.25వేల చొప్పున ప్రభుత్వ సాయం అందించారు.

ఆకట్టుకుంటున్న ప్రవచనాలు



ప్రవచిస్తున్న లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో దశ మహా విద్యలపై నాలుగు రోజులుగా వైభవంగా ప్రవచనాలు జరుగుతున్నాయి. కుర్తాళం శంకరాచార్య, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి చేస్తున్న ప్రవచనాలు భక్తులను ఆధ్యాత్మిక సాగరంలో పరవశింపజేస్తున్నాయి. దశ మహావిద్యల ప్రవచనాల్లో భాగంగా బుధవారం కాళీ మాత ఆవిర్భావంపై స్వామీజీ చేసిన విశేష ప్రసంగం సభికులను ఆకట్టుకుంది. కాళీ పూజలో కొన్ని ప్రాంతాల్లో ఉన్న వామాచార సంప్రదాయాన్ని వివరించారు. కాళీ దేవికి సంబంధించిన వివిధ పురాణ గాథలను రమణీయంగా ప్రవచించారు. దానవ సంహారం కోసం పరమేశ్వరి అవతరణే కాళీ రూపమని స్వామి పేర్కొన్నారు. శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిని పాల్గొన్నారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆర్కిడ్.. కనువిందు

- కంబాలకొండలో ప్రయోగాత్మకంగా అమలు
- కొత్త రూపు తీసుకొచ్చిన ఆర్కిడారియంలు
- జీవ వైవిధ్యానికి అటవీశాఖ విభిన్న ప్రణాళికలు
- నిర్మాణంలో ఔషధ మొక్కల పార్కు
- రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రకృతి వివరణ కేంద్రం

సాక్షి, విశాఖపట్నం: పురాతన పర్వత శ్రేణులైన తూర్పు కనుమల్లో 16 శాతం మేర అటవీ సంపద క్షీణించింది. దీన్ని అధిగమిస్తూ కనుమలను పరిరక్షించేందుకు మిషన్ కన్జర్వ్ ఈస్టర్న్ ఘాట్ పేరుతో రాష్ట్ర అటవీ శాఖ నడుంబిగిస్తూ... పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీఎల్)తో ఒప్పందం కుదుర్చుకుంది. కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ రెస్పాన్స్ బిలిటీలో భాగంగా రూ.90లక్షలతో కంబాల కొండలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. విశాఖ నగరం, చుట్టుపక్కల అడవుల్లో పచ్చదనంతో పాటు జీవ వైవిధ్యాన్ని పెంపొందించడం.. అవగాహన కల్పించడానికి చేపట్టిన పనులు చురుగ్గా సాగుతున్నాయి.

అద్భుతాల ఆర్కిడారియం

తూర్పు కనుమల్లో గ్యాంబుల్, ఫిషర్, మాథ్యూ, హెన్రీ తదితర 66 జాతులకు చెందిన 199 ఆర్కిడ్ జాతులున్నట్లు గుర్తించారు. కీటకాలు, పక్షులు, గబ్బిలాలకు తేనె, పుప్పొడి, పండ్లు, విత్తనాలు వంటి ఆహార వనరులను ఈ ఆర్కిడ్ వృక్షజాతులు అందిస్తాయి. ప్రపంచంలోని 1,256 ఆర్కిడ్ జాతుల్లో 307 భారత్‌కు చెందినవే. తూర్పు కనుమల్లోని కొన్ని ఉష్ణ మండల ప్రాంతాలు ఆర్కిడ్‌లకు నిలయంగా ఉన్నాయి. ఈ జాతులను సంరక్షిస్తూ.. పెంచేందుకు రూ.20 లక్షల వ్యయంతో ఆర్కిడారియంను నిర్మించారు. ఈ ఆర్కిడారియంలో బుల్బోఫిలమ్ వెస్టిటా, హబినారియా పానిగ్రాహియానా, లిపారిస్ పియోని మొదలైన స్థానిక ఆర్కిడ్‌ల మనుగడకు ప్రయోజనం చేకూర్చేలా ఏర్పాట్లు చేశారు. కంబాల కొండ అభయారణ్యంలో ఆర్కిడ్ పూలు ఇప్పుడు కనువిందు చేస్తున్నాయి. ఇప్పటికే పెరిగిన మొక్కల్లో పూలు పూచాయి. దాదాపు 20 రోజులకు పైగా వాడిపోకుండా.. తాజాగా కనిపించే ఆర్కిడ్‌లతో ఆర్కిడారియం కళకళలాడుతోంది.



ఔషధ వనం పనుల్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఔషధ మొక్కల పార్కు

ఆధునికీకరణ ప్రభావంతో జీవ వైవిధ్యానికి ముప్పు వాటిల్లుతున్న తరుణంలో.. తూర్పు కనుమల్లో వాటిని సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఇందుకోసం బయోడైవర్సిటీ పార్కు ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా రూ.20 లక్షలతో ఔషద మొక్కల పార్కు నిర్మాణ పనులు దాదాపు చివరికి వచ్చేశాయి. దీని ద్వారా ప్రజల్లో పర్యావరణం పట్ల ఆసక్తిని పెంచడమే కాకుండా మొక్కల వల్ల ఒనగూరే ఆరోగ్య ప్రయోజనాలు, ప్రకృతి పరిరక్షణ ఆవశ్యకతపై అవగాహన కల్పించనున్నారు. జీవ వైవిధ్య పార్కుతో పాటు కంబాల కొండ సాహస కృత్యాలకు నెలవుగా ట్రెక్కింగ్, ట్రయల్స్‌తో ఫికస్టేరియంను కూడా నిర్మిస్తున్నారు.



ఆర్కిడారియంలో పూసిన ఆర్కిడ్ పూలు

ఈ కేంద్రం వాకర్స్‌కు స్వర్గధామంగా, అభ్యాసన కేంద్రంగా మారనుంది.

రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రకృతి వివరణ కేంద్రం

సెంట్రల్ నర్సరీలో ప్రస్తుతం ఉన్న భవనం ప్రకృతి వివరణ కేంద్రంగా పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఇది తూర్పు కనుమలు, కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యంలోని పుష్పజాతులు, జంతుజాలం ఇతర ప్రాణుల గురించి విశదీకరించనుంది. గిరిజనులు, నదులు, పర్యావరణ వ్యవస్థ పనితీరుపై ఆధారపడిన నమూనాలు, తూర్పు కనుమలలోని మడ, సాధారణ అడవులు, గిరిజనుల జాతి–వృక్షశాస్త్రం మొదలైన వివరాలను అందిస్తుంది. సహజమైన తూర్పు కనుమల పర్యావరణ వ్యవస్థకు సంబంధించిన వాస్తవిక చిత్రాన్ని ప్రదర్శించడానికి చెట్ల ఫెర్న్‌లు, గడ్డి, ఇతర స్థానిక వృక్షజాలంతో ప్రత్యక్ష నమూనా కూడా ఏర్పాటు చేసే పనులు సాగుతున్నాయి. ఏపీలో ఈ తరహా కేంద్రం ఏర్పాటు చేయడం ఇదే ప్రథమం.



సిద్ధమవుతున్న ప్రకృతి వివరణ కేంద్రం

జూలై నాటికి అందుబాటులో..



తూర్పు కనుమల భవిష్యత్‌తోనే ప్రజల భవిష్యత్ ముడిపడి ఉంది. రాజీ లేకుండా అడవులను పరిరక్షించాలి. పశ్చిమ కనుమలు, హిమాలయాల మాదిరిగానే తూర్పు కనుముల ప్రాంతం జీవ వైవిధ్యానికి హాట్‌స్పాట్‌గా ఉంది. అందుకే ఈస్టర్న్ ఘాట్స్‌ను సంరక్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక వృక్ష, జంతుజాల స్థితిపై సర్వేలను ప్రారంభించి.. వాటి పరిరక్షణకు చర్యలు చేపడుతున్నాం. విత్తనాల సేకరణ, నర్సరీల పెంపకం, మొక్కల పెంపకాన్ని దత్తత తీసుకోవడం, పెరిగిన జాతులను సమర్థవంతంగా పర్యవేక్షించడం వంటి వివిధ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నాం. మిషన్ ఈస్టర్న్ ఘాట్‌లో భాగంగా కంబాల కొండలో జరుగుతున్న పనులు జూలై నాటికి పూర్తి కానున్నాయి.

–అనంతశంకర్, డీఎఫ్‌వో, విశాఖపట్నం

కనకమహాలక్ష్మి సన్నిధిలో పలువురు ప్రముఖులు



న్యాయమూర్తికి అప్పన్న చిత్రపటాన్ని అందజేస్తున్న ఏఈవో నరసింహరాజు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): కనకమహాలక్ష్మిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జస్టిస్ బీవీఎస్ఎల్ చక్రవర్తి దంపతులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, బీసీ రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ అమ్మవారిని దర్శించుకున్నారు. ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో..

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.ఎల్.ఎన్.చక్రవర్తి సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, అంతరాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను ఆయనకు ఏఈవో నరసింహరాజు అందజేశారు.



లక్ష్మీపార్వతికి అమ్మవారి ప్రసాదం అందిస్తున్న చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం



నగరంలో మెరుపుల హోరు..

గాజువాక: ఉక్కునగరంలో గాలివాన బీభత్సం సృష్టించింది. బుధవారం కురిసిన వర్షంతో పాటు వీచిన పెనుగాలులకు చెట్లు తెగిపడ్డాయి. అన్ని సెక్టార్లలోనూ చెట్లు అధికంగా ఉండటంతో భారీ గాలులకు వాటి కొమ్మలు రోడ్లకు అడ్డంగా పడిపోయాయి. దీంతో ఉక్కునగరంలో రహదారులన్నీ మూసుకుపోయాయి. ఈ కారణంగా నివాసితులు తమ బైక్‌లు, కార్లలో ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి చోటుచేసుకుంది. కూర్మన్నపాలెం నుంచి మెయిన్ గేటుకు వెళ్లే రహదారిలోనూ ఇదే పరిస్థితి చోటుచేసుకోవడంతో రాత్రి షిఫ్ట్‌కు వెళ్లాల్సిన కార్మికులు అవస్థలను ఎదుర్కొన్నారు. కాగా.. విషయం తెలుసుకున్న ఉక్కు అధికారులు అప్పటికప్పుడు సహాయక బృందాలను రంగంలోకి దించడంతో పలు ప్రధాన రహదారులలోని చెట్ల కొమ్మలను తొలగించి రాకపోకలకు మార్గం సుగమం చేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. గాజువాకలో కూడా ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆనందహేల

- క్రమబద్ధీకరణకు కేబినెట్ ఆమోదం
- జిల్లాలో 400 మందికి మేలు
- తమ జీవితాల్లో సీఎం జగన్ వెలుగులు నింపారని భావోద్వేగం

సాక్షి, విశాఖపట్నం: ప్రజా సంకల్పయాత్రలో అప్పటి ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆవేదన విన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. మాట నిలబెట్టుకొని కాంట్రాక్ట్ ఉద్యోగుల 23 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ.. వారికి తీపికబురు అందించారు. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని 400 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు సంబరాల్లో మునిగితేలారు. ఇచ్చిన మాటకు కట్టుబడి.. తమ జీవితాల్లో ఆనందం నింపారని భావోద్వేగానికి గురయ్యారు. జీవితాంతం సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని చెప్పారు. అలాగే జిల్లా కేంద్రాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ 12 శాతం నుంచి 16 శాతానికి పెంచడంతో పాటు సీపీఎస్ స్థానంలో గ్యారెంటీ పెన్షన్ స్కీం (జీపీఎస్) బిల్లు ముసాయిదాను ఆమోదించారు. ఈ నిర్ణయాలపై కాంట్రాక్ట్, ప్రభుత్వ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోర్టు కేసు పేరిట టీడీపీ ప్రభుత్వం తప్పించుకుంది

2014 ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని చంద్రబాబు దొంగ హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి రాగానే ముఖం చాటేశారు. టీడీపీ ప్రభుత్వం న్యాయస్థానంలో కేసుల పేరిట కాంట్రాక్ట్ ఉద్యోగులకు అన్యాయం చేసింది. ఈ విషయాన్ని పలుమార్లు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు దృష్టికి కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు తీసుకెళ్లినా.. ఏ మాత్రం ప్రయోజనం లేకపోయింది. ఈ పరిస్థితుల్లో ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పలుచోట్ల వీరు కలిసి తమ గోడును వినిపించారు. దీనికి స్పందించిన ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత మంచి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకుని ఆ హామీని నెరవేర్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే తమకు న్యాయం జరిగిందని ఉమ్మడి విశాఖ జిల్లా కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ల ప్రతినిధులు కొనియాడుతున్నారు. ఎప్పటినుంచో పనిచేస్తున్న తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడం చాలా సంతోషంగా ఉందని, ముఖ్యమంత్రి సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తుండగా.. వీరిలో ఉమ్మడి విశాఖ జిల్లాలో 400 మంది ఉన్నారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట సీఎం జగన్ చిత్రపటంతో కాంట్రాక్ట్ ఉద్యోగుల సంబరాలు

చెప్పారంటే.. చేస్తారంతే

మహారాణిపేట: కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ.. రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడంతో ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. రేసవానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటం పట్టుకుని.. స్వీట్లు పంచుకున్నారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. తమ జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని ఉద్యోగులు వై.ఎస్.చలం, వై.వి.రమణ, మురళీ, గణేష్, శ్రీను, రాజేష్, దుర్గారావు, శంకర్, నాగరాజు, శ్రీనివాసరెడ్డి తదితరులు తెలిపారు.


థ్యాంక్యూ సీఎం సార్



కాంట్రాక్ట్ ఉద్యోగులకు రెగ్యులరైజ్ చేసినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నాం. ప్రజా సంకల్పయాత్రలో మా గోడును ఆయన దృష్టికి తీసుకెళ్లాం. ఆయన ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించారు. టీడీపీ హయాంలో కాంట్రాక్ట్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగింది. న్యాయస్థానంలో కేసును బూచిగా చూపించి టీడీపీ ప్రభుత్వం తప్పించుకుంది.

– వైఎస్ చలం, కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు

పీఆర్‌సీతో 16 లక్షల మందికి లబ్ధి



ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుకుంటూ వస్తోంది. డీఏ, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ కూడా విడుదల చేసింది. 23 ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల చిరకాల కల నెరవేరింది. కొత్త జిల్లాల్లో హెచ్‌ఆర్‌ఏ 12 శాతం ఉంది. దీన్ని 16 శాతం పెంచడం సంతోషంగా ఉంది. ఉద్యోగులు అడిగిన వెంటనే ఆమోదించారు. సీపీఎస్ రద్దు చేశారు. 12వ పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పీఆర్‌సీ కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 16 లక్షల మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు.

– కె.ఈశ్వరరావు, ఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా ప్రెసిడెంట్

కల నెరవేరింది



పీఆర్‌సీ కమిటీ వేస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గ నిర్ణయం. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ చరిత్రాత్మకం. ఇన్నాళ్లకు వారి కల నెరవేరింది. మిగిలిన వారికి కూడా దశల వారీగా రెగ్యులర్ చేయాలని కోరుతున్నాం.

– డి గోపినాథ్, పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ జిల్లా ప్రెసిడెంట్


సంస్కరణలు బాగున్నాయి



వయసు తక్కువైనా.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలు చాలా హర్షించదగినవి. అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఇంటర్ విద్య వరకు పేద విద్యార్థులను ఎలా తీర్చిదిద్దాలనే తపన పడుతున్నారు. ఉద్యోగుల పక్షపాతిగా సంస్కరణలు చేపట్టి ముందుకు వెళుతున్నారు.

–గాదె శ్రీనివాసులనాయుడు, మాజీ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

దళితులకు ప్రవేశం లేదనే ప్రచారం అవాస్తవం



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆదిపురుష్ పోస్టర్

సీతంపేట: ఆదిపురుష్ సినిమా ప్రదర్శించే థియేటర్లలో దళితులకు ప్రవేశం లేదని సోషల్ మీడియాలో ఓ పోస్టర్ వైరల్ కావడం విశాఖ నగర పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ చిత్రం ప్రొడక్షన్/డిస్ట్రిబ్యూషన్ యూనిట్లు ఆ పోస్టర్‌లోని విషయాలను ఖండించాయని, ఇటువంటి వార్తలను ప్రజలెవరూ నమ్మవద్దని విశాఖ నగర పోలీస్ శాఖ ఓ ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ పోస్టర్‌ను ఎవరూ ఫార్వర్డ్ లేదా షేర్ చేయవద్దని, ఇలాంటి ప్రచారానికి పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ హెచ్చరించారు.

టీడీపీ నేత కుటుంబం లబ్ధి రూ.1.13 లక్షలు

- వివక్ష లేని పాలనకు నిదర్శనం జగనన్న ప్రభుత్వం
- 'గడపగడప'లో ముత్తంశెట్టి వెల్లడి

సింహాచలం: వివక్ష చూపని పాలనకు నిదర్శనం సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వమని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అడవివరంలో బుధవారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు కుటుంబం పలు ప్రభుత్వ పథకాల ద్వారా రూ.1,12,991 లబ్ధి పొందిందని ముత్తంశెట్టి తెలిపారు. శంకరరావు తల్లికి పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్ అందజేశారు. వైఎస్సార్ ఆసరా కింద రూ.18,754, సున్నా వడ్డీ రూ.3 వేలు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రూ.91,237 లబ్ధి చేకూరింది. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను వైఎస్ జగన్ సర్కారు అందిస్తోందనడానికి ఇదే నిదర్శనమని ముత్తంశెట్టి తెలిపారు.



టీడీపీ అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు తల్లికి బుక్‌లెట్ అందజేస్తున్న ముత్తంశెట్టి

సాగి రామభద్రరాజు కన్నుమూత



రామభద్రరాజు (ఫైల్)

కోటవురట్ల: తంగేడు రాజవంశంలో మరో శకం ముగిసింది. దాదాపు 30 ఏళ్లపాటు ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్‌గా సేవలందించిన రాజా సాగి రామభద్రరాజు (76) బుధవారం విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబంతో ఆయన సత్సంబంధాలు ఉన్నాయి. వైఎస్సార్ ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు పలుమార్లు తంగేడులో బస చేసి తన అభిమానాన్ని, అనుబంధాన్ని చాటేవారు. ఆరంభం నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్న రామభద్రరాజు వైఎస్సార్ మరణం తర్వాత వైఎస్సార్‌సీపీలో కొనసాగారు. వరుసకు మేనల్లుడైన మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజుకు మార్గదర్శిగా నిలిచారు. ఆయన మృతితో జిల్లా అంతటా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన పార్థివ దేహానికి తంగేడు రాజా కుటుంబీకులతోపాటు ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, పెట్ల ఉమాశంకర్ గణేష్, పలువురు నాయకులు ఘనంగా నివాళులర్పించారు.

స్టూడెంట్ బస్ పాస్‌ల జారీకి ఏర్పాట్లు

డాబాగార్డెన్స్: విద్యా సంస్థలు ఈ నెలలో ప్రారంభం కానున్న దృష్ట్యా విద్యార్థులకు బస్ పాస్‌లు జారీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రాంతీయ మేనేజర్ అప్పలరాజు ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ద్వారకా బస్టేషన్, మద్దిలపాలెం, సింహాచలం, గాజువాక, మధురవాడ, ఎంవీపీ బస్టేషన్, కూర్మన్నపాలెం బస్టేషన్ సెంటర్లలోని కౌంటర్లు ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేయనున్నాయని పేర్కొన్నారు.

విద్యార్థులు, విద్యా సంస్థలకు సూచనలు

- www.apsrtcpass.inలో వివరాలు, ఫొటో నమోదు చేసుకుని.. అప్లికేషన్ ఫారం ప్రింట్ తీసుకోవాలి.
- అప్లికేషన్‌పై విద్యా సంస్థ ప్రిన్సిపాల్/ప్రధానోపాధ్యాయుడిచే ధ్రువీకరించి సంబంధిత డిపో కార్యాలయానికి వెళ్లాలి.
- దరఖాస్తుకు ఆధార్, 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మార్కుల జాబితా జిరాక్స్ కాపీని జతపరచాలి. అప్లికేషన్‌పై ఫోన్ నంబర్ తప్పనిసరిగా రాయాలి.
- విద్యార్థుల జాబితాను తరగతుల వారీగా ప్రిన్సిపాల్/ప్రధానోపాధ్యాయుడు సంతకంతో సంబంధిత డిపో మేనేజర్ కార్యాలయానికి అందజేయాలి. అలా చేయని విద్యా సంస్థలకు పాస్‌లు జారీ చేయరు.

బస్ పాస్‌లు ఇలా..

12 ఏళ్లలోపు బాలురు, 18 ఏళ్లలోపు బాలికలకు(10వ తరగతి వరకు) ఉచిత బస్ పాస్‌లు అందజేస్తారు. స్టూడెంట్ జనరల్ బస్‌పాస్(ఏడాది, క్వార్టర్లీ, మంత్లీ), గ్రేటర్ విశాఖ పాస్, రూట్ పాస్, జీవోసీ పాస్ కావాలనుకునే విద్యార్థులు సంబంధిత డిపోల్లోని కౌంటర్లలో దరఖాస్తులు సమర్పించాలని ప్రాంతీయ మేనేజర్ సూచించారు.

పలు రైళ్ల రద్దు



తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం దృష్ట్యా ట్రాక్‌ల నిర్వహణ, లింక్ రైళ్ల రాకపోకలు ఆలస్యం వల్ల ఆయా స్టేషన్లలో బయల్దేరాల్సిన పలు రైళ్లను రద్దు చేసినట్టు డీసీఎం త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. విల్లుపురంలో బుధవారం బయల్దేరవలసిన విల్లుపురం–పురూలియా(22606) ఎక్స్‌ప్రెస్ రద్దయింది. చెన్నై సెంట్రల్‌లో బయల్దేరవలసిన చెన్నై సెంట్రల్–షాలిమార్(12840) మెయిల్ ఎక్స్‌ప్రెస్‌ను కూడా రద్దు చేశారు. పాండిచ్చేరిలో బయల్దేరవలసిన పాండిచ్చేరి–హౌరా(12868) ఎక్స్‌ప్రెస్ కూడా రద్దయిందని డీసీఎం తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి సేవిస్తున్న యువకులు

సీతమ్మధార: కైలాసపురం ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 70 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ.. కైలాసపురంలోని ప్రాంతంలో బుధవారం స్వామి, ప్రదీప్‌లు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడకు వెళ్లారు. వారిని అదుపులోకి తీసుకొని ఫోర్త్‌టౌన్‌కు అప్పగించారు. యువకులను సీఐ శ్రీనివాసరావు విచారించారు. గంజాయి విక్రయించే వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు.

వివాహిత ఆత్మహత్య

తగరపువలస(భీమిలి): భీమిలి జోన్ రెండో వార్డు జీరుపేటలో బుధవారం మధ్యాహ్నం డెక్కతి ధనలక్ష్మి(24) అనే వివాహిత కన్నవారింట్లో ఆత్మహత్య చేసుకుంది. వెంటనే ఆమె కుటుంబ సభ్యులు సంగివలస ఎన్‌ఆర్‌ఐ జనరల్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతె ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసును సీఐ కె.లక్ష్మణమూర్తి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. మృతురాలికి ఏడాది క్రితం విజయనగరం జిల్లా భోగాపురం మండలం గుడివాడకు చెందిన ముఠా కార్మికుడు కనక గోవిందరెడ్డితో వివాహమైంది. 20 రోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఆమె మృతితో జీరుపేట, గుడివాడలో విషాదఛాయలు అలముకున్నాయి.

కాన్వాస్‌పై మెరుపులు

- చిత్ర లేఖనంలో రాణిస్తున్న బాలికలు
- వలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సొంతం

అల్లిపురం(విశాఖ దక్షిణ): చేతిలో కుంచె పడితే చాలు ఇంద్రధనస్సులో ఉన్న రంగులన్నింటిని వారు అవలీలగా వాడేస్తారు. కాన్వాస్‌పై చేయి పెడితే దించే చాన్స్ ఉండదు. చిత్ర లేఖనంలో అద్భుతాలు సృష్టిస్తున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మెట్టు మెట్టు అధిరోహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. పాఠశాల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ అవార్డులు సైతం కొల్లగొడుతున్నారు. ఎంవీపీ కాలనీకి చెందిన పూర్వీ రజాక్, ఎస్ఏడీ కొత్త రోడ్డుకు చెందిన చలపరెడ్డి భవజ్ఞ చిత్రలేఖనంలో విశేష ప్రతిభ కనబరుస్తున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి పూర్వీ రజాక్

ఎంవీపీ కాలనీకి చెందిన పూర్వీ రజాక్ లిటిల్ ఏంజిల్స్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. తండ్రి సునీల్ రజాక్ ద్వారకానగర్‌లో స్పోకెన్ ఇంగ్లిష్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహిస్తున్నారు. తల్లి మమత రజాక్ ఢిల్లీకి చెందిన ఒక స్వచ్ఛంద సంస్థలో వలంటీర్‌గా పని చేస్తున్నారు. పూర్వీ రజాక్


సాధించిన పతకాలతో పూర్వీ రజాక్

మూడేళ్ల వయస్సులోనే చిత్ర లేఖనంలో మొదటి అవార్డు సాధించింది. నాలుగో ఏట కామ్లిన్ ఆర్ట్ అవార్డు గెలుచుకుంది. దీంతో చిత్రలేఖనంలో కుమార్తె ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. పాఠశాల స్థాయి నుంచి ఇంటర్ స్కూల్, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికలపై తన ప్రతిభను నిరూపించుకుంది. వివిధ స్థాయిల్లో పతకాలు, ట్రోఫీలు సొంతం చేసుకుంది.

కవయిత్రిగా కూడా రాణింపు

పూర్వీ రజాక్ ఒక్క చిత్ర లేఖనంలోనే కాకుండా కవయిత్రిగా కూడా రాణిస్తోంది. వందకు పైగా కవితలు రాసింది. ఆమె రాసిన 75 పద్యాలతో ఇటీవల న్యూఢిల్లీకి చెందిన అనురాగ్యం పబ్లికేషన్ ×ది ఫాసినేషన్ వరల్డ్ ఆఫ్ పోయమ్స్×అనే కవితల పుస్తకాన్ని ప్రచురించింది. ఈ పుస్తకాన్ని 75 సంవత్సరాల ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌కు అంకితమిచ్చారు. వీటితో పాటు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలు, వక్తృత్వ, కథలు చెప్పడం, ఈజీ రైటింగ్, స్లోగన్ రైటింగ్, పద్య పఠనం, అబాకస్ వంటి వాటిలో కూడా ప్రతిభ కనబరుస్తోంది.

వరించిన అవార్డులు

- ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్
- భారతీయ బాల కళా సంస్కృతి అవార్డు
- ఇండియన్ ఐకాన్ అవార్డు
- ఫ్రీడమ్ ఆర్ట్ అవార్డు
- అత్యంత వినూత్నమైన గ్లోబల్ ఆర్టిస్ట్ అవార్డు
- కళా ఉత్సవ్ అవార్డు
- కళా రత్న అవార్డు
- సూపర్ టాలెంటెడ్ గర్ల్ అవార్డు–2023



పూర్వీ రజాక్ గీసిన చిత్రం

- భారతీయ మహిళా గౌరవ్ సమ్మాన్ 2023
- సహారా చారిటబుల్ ది సూపర్ ఉమెన్ అవార్డు
- ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డ్–2023
- ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్–2023లో చోటు దక్కించుకుంది
- ఇటీవల సాక్షి మీడియా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో రెండో బహుమతి గెలుచుకుని సత్తా చాటింది.



తనకు వచ్చిన అవార్డులతో భవజ్ఞ

భవజ్ఞ చేతిలో అపురూపాలు

చిత్రం అనే ఛత్రంలో తన భవిష్యత్‌ను తీర్చిదిద్దుకుంటుంది ఎస్ఏడీ ప్రాంతానికి చెందిన చలపరెడ్డి భవజ్ఞ. చిన్నప్పటి నుంచి భవజ్ఞ డ్రాయింగ్‌పై ఆసక్తి కనబరచడంతో ఆమె తల్లిదండ్రులు యూట్యూబ్ ద్వారా మెలకువలు తెలియజేశారు. అలా శిక్షణ పొందిన భవజ్ఞ చేయి ఇప్పుడు కుంచెతో కాన్వాస్‌పై విన్యాసాలు చేస్తుంది. ఆమె తండ్రి మధుబాబు విశాఖ డెయిరీలో మార్కెటింగ్‌లో పని చేస్తున్నారు. తల్లి శ్వేత గృహిణి. ఉపాధ్యాయుల ప్రోత్సాహం కూడా తోడవడంతో చిత్ర లేఖనంలో ఆమె విశేష ప్రతిభ కనబరుస్తోంది.

అందుకున్న అవార్డులు

- 2019లో గూగుల్ డూడుల్ కాంటెస్ట్‌లో లక్ష మందిలో టాప్–20లో నిలిచింది.
- యాక్సిస్ బ్యాంక్ స్పార్ల్స్–2023 ఆర్ట్ కాంపిటేషన్‌లో విన్నర్‌గా నిలిచింది.
- న్యూఢిల్లీకి చెందిన అనురాగ్యం సంస్థ నిర్వహించిన కాంపిటేషన్‌లో ద్వితీయ బహుమతి గెలుచుకుంది.
- ది హిందూ నిర్వహించిన వరల్డ్ ఓజోన్ డే సందర్భంగా ఎర్త్–2040 కాంటెస్ట్‌లో తృతీయ బహుమతి సొంతం
- డిపార్ట్‌మెంట్ పోస్ట్స్ నిర్వహించిన ఆన్‌లైన్ పోస్టర్ కాంపిటేషన్‌లో మొదటి బహుమతి
- ఇండియన్ సొసైటీ ఆఫ్ హీటింగ్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ ఇంజినీర్స్ నిర్వహించిన జాతీయ స్థాయి కాంపిటేషన్‌లో మొదటి బహుమతితో సత్తా
- నేషనల్ సైన్స్ డే సందర్భంగా ఎన్ఎస్‌టీఎల్ నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతి.
- చెన్నైకు చెందిన శ్రీదర్శిని కలాయి కూడమ్ మ్యూజిక్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ నుంచి బెస్ట్ ప్రజెంటేషన్ అవార్డు సొంతం
- ఎన్‌టీపీసీ నిర్వహించిన పోటీల్లో మూడవ బహుమతి గెలుచుకుంది.
- ఇటీవల సాక్షి మీడియా నిర్వహించిన డ్రాయింగ్ కాంపిటేషన్‌లో మూడో బహుమతి గెలుచుకుంది. ఇలా 30 వరకు అవార్డులు గెలుచుకుని తన సత్తా చాటుకుంది.


భవజ్ఞ చిత్రీకరించిన చిత్రం

గుర్తు తెలియని వ్యక్తి మృతి

బీచ్ రోడ్డు(విశాఖ తూర్పు): రామ్‌నగర్ కేర్ ఆస్పత్రి ఫుట్‌పాత్‌పై ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 45 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి ఎటువంటి చలనం లేకుండా ఫుట్‌పాత్‌పై పడి ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు అయనను పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడిని గుర్తిస్తే మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ రామారావు కోరారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మంచినీరు కలుషితం కాలేదు

- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం
- వాటర్‌సప్లై ఏఈ కనకారావు

మల్కాపురం(విశాఖ పశ్చిమ): జీవీఎంసీ 61వ వార్డు జాలరివీధిలో బుధవారం ఉదయం సరఫరా చేసిన తాగునీరు కలుషితమైందని సోషల్ మీడియాలో అయిన ప్రచారంలో వాస్తవం లేదని మల్కాపురం వాటర్ సప్లై ఏఈ కనకరావు స్పష్టం చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేయడంపై ఆయన మండిపడ్డారు. బుధవారం సరఫరా చేసిన తాగునీరు లేత పసుపు రంగు మాదిరిగా ఉందని స్థానిక సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఏఈ కనకరావు సిబ్బందితో కలిసి జాలరివీధికి వెళ్లి సరఫరా అయిన నీటిని పరీక్షించారు. అలాగే నీటి రంగు చూశారు. అయితే ఎప్పటి మాదిరిగానే తాగునీరు శుభ్రంగానే ఉంది. నీటిలో మినరల్స్ శాతం సక్రమంగానే ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా ఏఈ కనకారావు మాట్లాడుతూ సోషల్ మీడియాలో వస్తున్న అవాస్తవాలను నమ్మవద్దని కోరారు. మంచినీటి సరఫరాలో ఏమైనా సమస్య ఉంటే కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు.


నీటిని పరీక్షిస్తున్న అధికారి



బుధవారం సోషల్ మీడియాలో వైరల్ అయిన లేత పసుపు రంగుతో ఉన్న మంచినీరు



సరఫరా అయిన నీటి రంగు ఇది

ర్యాంప్‌పై మెరిసిన మహిళలు

డాబాగార్డెన్స్: న్యూ హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి నేతృత్వంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా బుధవారం నిర్వహించిన మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర–2023 పోటీలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేలా సాగాయి. ఫైనల్ పోటీల్లో 10 మంది మహిళలు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చేనేత కళాకారుల సహాయార్థం చేపట్టిన ఈ పోటీల్లో మిసెస్ ఉత్తరాంధ్ర టైటిల్‌ను వెంపటి సరళ, మిస్ ఉత్తరాంధ్ర టైటిల్‌ను శ్రేయ వనమాలి కైవసం చేసుకున్నారు. మిసెస్ ఉత్తరాంధ్ర రన్నరప్‌గా కోశెట్టి రాజ్యలక్ష్మి, మిస్ ఉత్తరాంధ్ర రన్నరప్‌గా నిహారిక నిలిచారు. అనంతరం గ్రంథాలయ మాజీ చైర్మన్ తోట నగేష్ మాట్లాడుతూ మహిళలను చైతన్యపరిచేలా ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రాజబాబు, సీనియర్ నాయకుడు అప్పారావు, ఎస్కే ఇన్‌ఫ్రా చైర్మన్ అంబల్ల సురేష్, వీ టెండల్ చైర్మన్ రమేష్, డాక్టర్ నాగసుధాలక్ష్మి, న్యూ హోప్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎండీసీ సేవలు ప్రశంసనీయం

సీతంపేట(విశాఖ ఉత్తర): రాష్ట్ర వ్యాప్తంగా సీఎండీసీ చేపడుతున్న సామాజిక సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. సీతమ్మధారలోని కావలెంట్ క్రైస్ట్ చర్చిలో క్రిస్టియన్ మైనార్టీ డెవలప్‌మెంట్ కౌన్సిల్(సీఎండీసీ) ఆధ్వర్యంలో బుధవారం ఉత్తరాంధ్ర జిల్లాల సర్వసభ్య సమావేశం జరిగింది. సీఎండీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గుణ శామ్యూల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాన్‌వెస్లీ ముఖ్య అతిథిగా పలువురికి కుట్టు మిషన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని జిల్లాలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయడం, వైద్య శిబిరాల నిర్వహణ, ఆపదలో ఉన్నవారికి భరోసా కల్పించడం వంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎండీసీ వ్యవస్థాపకుడు బిషప్ పండు ప్రేమ్‌కుమార్, ఎం.ఎ.పాల్, అధ్యక్షుడు డేవిడ్ పాల్, ప్రధాన కార్యదర్శి జీవనమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గుణ శామ్యూల్, ఉత్తరాంధ్ర జిల్లాల చైర్మన్ జయ్‌కుమార్, ఆయా జిల్లాల చైర్మన్‌లు, తదితరులు పాల్గొన్నారు.


కుట్టు మిషన్లు అందిస్తున్న కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ

నేటి నుంచి వీజేఎఫ్ సభ్యత్వ నమోదు

డాబాగార్డెన్స్: వీజేఎఫ్ ఎన్నికల ప్రక్రియకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున నియమించిన కమిటీ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వీజేఎఫ్ సభ్యుల జాబితాను పరిశీలించడంతో పాటు నూతన సభ్యుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ జి.బాలకృష్ణ వీజేఎఫ్ సభ్యులకు లేఖ ద్వారా సూచించారు. వీజేఎఫ్ కమిటీ అవకతవకలకు పాల్పడినట్లు కొంత మంది సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఐదుగురు సభ్యులతో నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీ పలు దఫాలు సమావేశాలు నిర్వహించి నివేదికను కలెక్టర్‌కు అందజేసినట్లు వెల్లడించారు. అనంతరం ప్రస్తుత సభ్యుల జాబితా పరిశీలన, కొత్త సభ్యత్వాల నమోదు, వీజేఎఫ్ సీనియర్ సభ్యుడిని రిటర్నింగ్ అధికారిగా నియమించి ఎన్నికల నిర్వహణతో పాటు జిల్లా ఆడిట్ అధికారి అధ్యక్షతన వీజేఎఫ్ ఆడిట్ రిపోర్టుల పరిశీలించాలని నిర్ణయించినట్లు వివరించారు. ప్రస్తుత సభ్యుల జాబితాను వీజేఎఫ్, ఐ అండ్ పీఆర్, ఆర్డీవో కార్యాలయాల్లో ప్రదర్శిస్తున్నట్లు డీఐజీ తెలిపారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఐఅండ్ పీఆర్ డీడీ, సబ్ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఆర్డీవో కార్యాలయం నుంచి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌లతో ఓ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కమిటీ వీజేఎఫ్ సభ్యులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియను చేపడుతుందన్నారు.

క్రీడల్లో విశాఖకు మంచి పేరు తేవాలి

- మేయర్ హరివెంకటకుమారి
- ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు

సీతంపేట(విశాఖ ఉత్తర): విద్యార్థులు క్రీడల్లో రాణించి విశాఖ నగరానికి మంచి పేరు తీసుకురావాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఆకాంక్షించారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో 15 రోజుల పాటు సాగిన వేసవి శిక్షణ శిబిరాల ముగింపోత్సవం స్థానిక స్వర్ణభారతి స్టేడియంలో బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 98 వార్డుల్లో 363 శిక్షణ కేంద్రాలు నిర్వహించగా.. సుమారు 10 వేల మంది వివిధ అంశాల్లో శిక్షణ పొందారని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలనే సదుద్దేశంతో ఈ శిబిరాలు నిర్వహించామన్నారు. క్రీడలతో ఉద్యోగావకాశాలు లభిస్తాయని, అందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. త్వరలో పలు చోట్ల మైదానాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నగర సీపీ త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ పిల్లలు తమకు నచ్చిన క్రీడలో రాణించాలని సూచించారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ కరోనా కారణంగా మూడేళ్ల పాటు నిర్వహించని సమ్మర్ క్యాంప్‌లు ఇకపై కొనసాగుతాయని చెప్పారు. ముగింపు వేడుకలకు హాజరైన విద్యార్థులతో అతిథులు మాట్లాడి ఏ ఆటల్లో శిక్షణ పొందారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. అనంతరం వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో మేయర్ హరివెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్‌వర్మ, తదితరులు

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ఎంవీపీ కాలనీ(విశాఖ తూర్పు): భూమాత రియల్ ఎస్టేట్ గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎంవీపీ కాలనీ సెక్టార్–1లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సంస్థకు చెందిన 100 మందికి పైగా ఉద్యోగులు రక్తదానం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారి సహాయార్థం రోటరీ, ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకుల సహకారంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్టు సంస్థ ఎండీ తాల్లూరి పూర్ణచంద్రరావు తెలిపారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సేల్స్ డైరెక్టర్ తాల్లూరి శివాజీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిరణ్, మార్కెటింగ్ డైరెక్టర్ కె.గోపాల్, పట్టాభి, పోతన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న భూమాత సంస్థ ప్రతినిధులు

వరదల గుర్తింపు ఉపకరణానికి పేటెంట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధకులు, ఆచార్యులకు నూతన పేటెంట్ మంజూరైంది. వరదలను ముందస్తుగా గుర్తించి, ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించడానికి ఉపయుక్తంగా నిలిచే 'మల్టీ ఫంక్షనల్, కాస్ట్ ఎఫెక్టివ్ స్మార్ట్ పోల్ ఫర్ ఎర్లీ ఫ్లడ్ డిటెక్షన్ అండ్ రెస్క్యూ ఆపరేషన్స్' ఉపకరణానికి భారత ప్రభుత్వం పేటెంట్ మంజూరు చేసింది. ఏయూ పరిశోధకులు డాక్టర్ రాజేష్ దువ్వూరు, జియో ఇంజినీరింగ్ ఆచార్యులు పి.జగదీశ్వరరావు సంయుక్తంగా దీనిని తీర్చిదిద్దారు. వరదలు సంభవించే అవకాశం ఉన్న ప్రాంతాలలో ముందస్తుగా స్మార్ట్ పోల్‌ని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలకు చేరవేసి సత్వర సేవలు అందించేలా ఈ పరికరాన్ని తీర్చిదిద్దారు. పేటెంట్ మంజూరు చేస్తూ జారీ చేసిన అధికారిక ఉత్తర్వులను రిజిస్ట్రార్ కృష్ణమోహన్‌కు ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ పురుషోత్తం, జగదీశ్వరరావు అందజేశారు.


రిజిస్ట్రార్ కృష్ణమోహన్‌కు ధ్రువపత్రం అందిస్తున్న ఆచార్య జగదీశ్వరరావు, తదితరులు